అప్‌గ్రేడ్ అయ్యేదెప్పుడో?

● కలగానే మిగిలిన 30 పడకల ఆస్పత్రి

దుగ్గొండి : గ్రామీణ ఆస్పత్రులు ఆదరణకు నోచుకోవడం లేదు. అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. రోగాల బారిన పడిన వారిని అక్కున చేర్చుకునే అవకాశం లేక అల్లాడుతున్నాయి. మండలంలోని 42 వేల మంది జనాభాకు సేవలందించడానికి రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. మండల కేంద్రంలో ఆరు పడకలతో 24 గంటల ఆస్పత్రి, కేశవాపురంలో 6 పడకలతో 12 గంటల ఆస్పత్రి ఉంది.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజు 100 నుంచి 160 వరకు రోగులు వస్తున్నారు. వీరిలో జబ్బు తీవ్రతను బట్టి ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకోవడానికి సరైన బెడ్‌లు లేవు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిని 30 పడకలుగా అప్‌గ్రేడ్ చేయిస్తామని 2015లో అప్పటి ఎంపీ సీతారాంనాయక్ హామీ ఇచ్చారు. ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. 8 ఏళ్లు గడిచాయి. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి 30 పడకల ఆస్పత్రిగా మార్చి వైద్య నిపుణులను నియమించి గ్రామీణ పేదలకు మెరుగైన వైద్యం అందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


దుగ్గొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

శిథిలావస్థకు చేరిన భవనం

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో భవనం మొత్తం ఉరుస్తుంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి రోజు 100 మందికి తగ్గకుండా రోగులు వస్తున్నారు. వారికి ఓపీ సేవలను అందిస్తున్నాం. అయితే అడ్మిట్ చేసుకునే క్రమంలో సౌకర్యాలు లేక ఇబ్బంది ఉండటంతో జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నాం. 30 పడకల ఆస్పత్రి అప్‌గ్రేడ్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- కిరణ్‌రాజ్, పీహెచ్‌సీ వైద్యాధికారి

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నల్లబెల్లి : మండలంలోని కన్నారావుపేటలో ఉద్యానవన పరిశోధన కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నల్లబెల్లి పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ మాట్లాడుతూ.. ఉద్యానవన పరిశోధన కేంద్రం ఏర్పాటుతో శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండడంతో రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. ఈ పరిశోధన కేంద్రం ఏర్పాటు కోసం కృషి చేసిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, సహకరించిన సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి, మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గందె శ్రీనివాస్ గుప్తా, ఇంగ్లే శివాజీ, మామిండ్ల మోహన్ రెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఏకకాలంలో రుణమాఫీ

చెన్నారావుపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏక కాలంలో రూ.లక్ష రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అక్కల్‌చెడలో ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. కౌలు రైతులకు సైతం రైతుబంధు వర్తింప చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం



దుగ్గొండి : మండల కేంద్రంలోని పలు గుడుంబా విక్రయకేంద్రాలపై ఆదివారం దాడులు చేసినట్లు ఎస్సై పరమేష్ తెలిపారు. గ్రామానికి చెందిన పులిచేరు సమ్మక్క, సరోజన, పులి సమ్మక్క గుడుంబా విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేయగా 11 లీటర్ల గుడుంబా దొరికిందన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాజకీయ యుద్ధభేరికి తరలిన పద్మశాలీలు


వర్ధన్నపేట: సభకు తరలి వెళ్తున్న పద్మశాలీలు


నర్సంపేట: యుద్ధభేరి బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న సర్వేశం

నర్సంపేట : కోరుట్లలో జరిగిన పద్మశాలి రాజకీయ యుద్ధభేరి ఆత్మీయ గౌరవ సభకు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్ ఆధ్వర్యంలో నర్సంపేట డివిజన్ నుంచి పద్మశాలీలు ఆదివారం తరలి వెళ్లారు. యుద్ధభేరికి తరలిన బస్సులను గౌరవ అధ్యక్షుడు బాల్నె సర్వేశం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రుద్ర ఓంప్రకాశ్, వెలుదంది వెంకటేశ్వర్లు, మెరుగు సాంబయ్య, గడ్డం రాజేందర్, శ్రీరాముల శంకరయ్య, కోదాటి మోహనకృష్ణ, శ్రీరాముల కోటేశ్వర్, పెండెం శివానంద్, నర్సంపేట భక్త మార్కెండేయ కాలనీ వాసులు, చెన్నారావుపేట, మహేశ్వరం, ముత్తోజిపేటకు చెందిన పద్మశాలీలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

చలో కోరుట్లకు తరలిన పద్మశాలీలు

వర్ధన్నపేట : కోరుట్లలో నిర్వహించిన పద్మశాలి రాజకీయ యుద్ధభేరీ సభకు ఆదివారం అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం పిలుపు మేరకు ఆదివారం వర్ధన్నపేట నుంచి పద్మశాలీలు తరలివెళ్లారు. మార్త సారంగపాణి, ఈగ దామోదర్, వేముల ఉపయోగం, పెద్దూరి సంజీవరావు, పెద్దూరి రాజ్‌కుమార్, చెన్న శ్రీధర్, రామ్‌చందర్, ప్రకాష్, సత్యం, ప్రభాకర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.


సంగెం నుంచి తరలివెళ్తున్న పద్మశాలీలు

సంగెం నుంచి..

సంగెం : కోరుట్ల పట్టణంలో నిర్వహించిన పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభకు మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. ఆదివారం పద్మశాలి మండల అధ్యక్షుడు కందకట్ల నరహరి ఆధ్వర్యంలో పద్మశాలీల రాజకీయ ఆత్మగౌరవ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం పద్మశాలీలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చట్ట సభల్లో తమకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిట్ల సత్యనారాయణ, ఇప్పకాల రమేష్, మనోహర్, విజయ్, అనుమాండ్ల రమేష్, కొంతం వేణు, యాకయ్య, కందకట్ల వెంకటేశ్వర్లు, సంపత్, బిట్ల రామకృష్ణ, బూర ప్రకాష్, చిందం వీరస్వామి, పులిపాటి మధు, శేఖరయ్య, సత్యం తదితరులు బయలుదేరి వెళ్లారు.

చేయూత



వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన దుబ్బాక మధుసూదన్ పాదుపు పరపతి సంఘంలో సభ్యుడు.. కాగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని పలువురు సభ్యులు ఆదివారం పరామర్శించి రూ. లక్ష ఆర్థికసాయం అందజేశారు. సభ్యులు శ్రీనివాసరావు, ఏపీ వేషయనం, సమ్మెట శ్రీనివాస్, వడ్లకొండ రాజు, బొజ్జ ప్రభాకర్, కీర్తి బాబురావు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిన మున్సిపల్ కార్మికులు

నర్సంపేట : మున్సిపాలిటీ పరిధిలోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర కుమారస్వామి, కోశాధికారి సింగారపు బాబు అన్నారు. ఈ మేరకు 40మంది మున్సిపల్ కార్మికులు ఆదివారం బీఆర్‌టీయూ నుంచి సీఐటీయూలో చేరారు. సీఐటీయూలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు కనీస సదుపాయాలు కల్పించి సమస్యలు పరిష్కరించే విధంగా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు హన్మకొండ శ్రీధర్, చిలుపాక యశోద, దేవేందర్, ఈసంపెల్లి యాకయ్య, హన్మకొండ మరియ, కానుగంటి ప్రశాంత్, కె.శ్రీను, ఎం.సుధాకర్, బి.రంజిత్, బి.నర్సయ్య, కనకతార, పద్మ, సుమలత, తిరుపతమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్మికులతో సీఐటీయూ నాయకులు

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేసీఆర్

మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

దుగ్గొండి : నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మంపేట గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు ఆదివారం రేవూరి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, నెరవేర్చని హామీలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టడానికి బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను లక్షల కోట్ల అప్పులకుప్పగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో అన్నీ వర్గాలకు న్యాయం, అభివృద్ధి జరుగుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో కొత్తపెల్లి రాజమౌళి, ఓర్సు కిట్టు, పోశాల రాజు, గందు సాంబయ్య, పల్లకొండ ఎల్లయ్య, కొత్తపల్లి సాంబయ్య ఉన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ జాటోత్ సంతోష్‌నాయక్, నల్లబెల్లి సుదర్శన్, మోకిడె ప్రభాకర్, రడం రాజేందర్, గోగుల ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.


బీజేపీలో చేరిన వారితో రేవూరి

ప్రభుత్వ భూమిలో అక్రమ సాగు

చెన్నారావుపేట : మండలంలోని జోజిపేట, నారాయణతండా గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా సేద్యం చేస్తున్న సంబంధించి అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్ 356/1లో ఉన్న ప్రభుత్వ భూమిని నంబర్ వన్ కాలనీకి చెందిన మీసా రాములు అనే వ్యక్తి చదును చేసి పొలం మడులుగా చేశాడు. దాదాపు 30గుంటల భూమిని ఆక్రమించుకున్నాడు. ఇటీవలే రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని సర్వే చేశారు. రోడ్డుకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా సాగు చేస్తున్న సంబంధిత రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.


చదును చేసిన ప్రభుత్వ భూమి

ఎన్నిక


వేణుగోపాల్

వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన చిట్టిమళ్ల వేణుగోపాల్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా డబ్ల్యూడీసీసీ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. శనివారం వరంగల్ పట్టణంలో నిర్వహించిన ఎన్నికల్లో వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రజక సంఘం మండల కమిటీ..

సంగెం : రజక సంఘం మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మునుకుంట్ల మోహన్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా మునుకుంట్ల మోహన్(సంగెం), అధ్యక్షుడిగా బొడ్డుపల్లి వెంకట్రాజ్యం(లోహిత), ఉపాధ్యక్షుడుగా నంగునూరి రమేష్(గవిచర్ల), కొండ్రాతి పాణి(ఎల్గూర్‌రంగంపేట), ప్రధాన కార్యదర్శిగా బర్ల యాకయ్య(రామచంద్రాపురం), సంయుక్త కార్యదర్శిగా చాపర్తి రాజేంద్రప్రసాద్(మొండ్రాయి), కోశాధికారి దురిశెట్టి కుమారస్వామి(తీగరాజుపల్లి). కార్యవర్గ సభ్యులుగా చాపర్తి శ్రీనివాస్(చింతలపల్లి), నంగునూరి శంకర్(నర్సానగర్), గట్టికొప్పుల ఎల్లయ్య(కాట్రపల్లి), నల్లతీగల అశోక్(నార్లవాయి), ముఖ్యసలహాదారులుగా నల్లతీగల ప్రభాకర్(కాపులకనిపర్తి), బొడ్డుపల్లి రాములు(పల్లారుగూడ)లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



సంగెం మండలంలోని మొండ్రాయి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా గూడ విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీరటి కుమారస్వామి, పరికి యాకయ్య, ఉపాధ్యక్షులుగా దుడ్డె చిరంజీవి, అనుముల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా చెవ్వ ఐలయ్య, కోశాధికారిగా కడ్దూరి రాజయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కేశవులు, మెట్టుపల్లి రమేష్, నాయకులు అచ్చ నాగరాజు, అనుముల కుమారస్వామి, ఇజ్జగిరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు


రాయపర్తి: బోనం ఎత్తిన ఉషాదయాకర్‌రావు


ఖానాపురం: బోనాలతో వెళ్తున్న మహిళలు

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్ గ్రామంలో ఆదివారం ఘనంగా పోచమ్మ బోనాలను నిర్వహించారు. సర్పంచ్ ధంశెట్టి సంధ్యారాణినర్సింగం, ఎంపీటీసీ కోల మల్లయ్యయాదవ్ బోనంతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు సమర్పించారు.

రాయపర్తిలో..

రాయపర్తి : మండల కేంద్రంలో గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ఆదివారం గ్రామదేవతలకు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్ పాల్గొని బోనం ఎత్తుకొని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండల కేంద్రంలో బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి గ్రామంలోని అన్ని వర్గాల మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల నడుమ గ్రామ శివారులోని దేవాలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పోశమ్మ దేవాలయంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావుపద్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

'సొంత స్థలం లేని వారి సంగతేంటి'

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం సొంత ఇంటి స్థలం ఉన్న వారికే వర్తిస్తుందా.. సొంత స్థలం లేని వారి పరిస్థితి ఏంటని, వారికి కూడా స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని నర్సంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుమ్మలపెల్లి సందీప్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు ఇస్తామని జీఓ విడుదల చేసిందన్నారు. దీంతో వారం రోజులుగా ప్రజలు ఏం చేయాలో తోచక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఏ ఒక్కరు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ మాటలను నమ్మే పరిస్థితిలో లేరని, సరైన సమయం వచ్చినప్పుడు నియోజకవర్గంలో, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి తప్పక బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.గతంలో డబుల్ బెడ్రూం ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సంపేట నియోజకవర్గానికి ఎన్ని డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారో చెప్పాలన్నారు.

వానరాలతో వణుకు

● ఇళ్ల ధ్వంసం, చెల్లాచెదురుగా వస్తువులు
● విచ్చలవిడిగా కోతుల గుంపు
● భయం భయంగా ప్రజలు

నల్లబెల్లి : గ్రామాల్లో కోతుల చేష్టలు మితిమీరుతున్నాయి.. ప్రతీ ఒంటి ఎదుట నిత్యం పదుల సంఖ్యలో వానరాలు కాపుకాస్తున్నాయి. తలుపు తీస్తే చాలు ఇంట్లోకి చొరబడి అందినకాడికి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోకి చొరబడిన కోతులను తరలించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకొవాలని ప్రజలు వేడుకుంటున్నారు. మండలంలోని గుండ్లపాహాడ్ గ్రామంలో కోతుల గుంపులను చూసి ప్రజలు భయపడుతున్నారు. కోతులను తరిమేందుకు ప్రయత్నిస్తే వారిపై ఎదురు దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. ఇంటి బయట ఎలాంటి తినే వస్తువులు పెట్టినా సరే కోతులగుంపు దాడి చేసి వాటిని తింటున్నాయి. పెంకుటిళ్లు, సిమెంట్ రేకుల ఇళ్లపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. కాగా ఆదివారం గుండ్లపాహాడ్ గ్రామంలోని అనంతగిరి సరోజన రేకుల ఇంటిపై కోతుల గుంపు దాడి చేసి ఇంటిని ధ్వంసం చేశాయి. ఇంట్లోని వస్తువులను చిందరవందర చేశాయి. కోతుల దాడిలో సుమారు రూ.30 వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు. కోతులను ఇళ్లపై నుంచి వెళ్లగొట్టేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు కోతుల దాడిలో గాయాలపాలవుతున్నారు. గ్రామాల్లోకి కోతులు రాకుండా ఉండేలా అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గుండ్లపాహాడ్‌లో కోతులు ధ్వంసం చేసిన ఇల్లు

ఆర్థికసాయం అందించాలి



కోతుల గుంపు దాడి చేయగా మా ఇల్లు ధ్వంసమైయింది. కోతులను పారదోలేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. వానరాలతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలి.

- అనంతగిరి కిషన్, గుండ్లపాహాడ్

ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నాం..



కోతులు గ్రామాలను వదిలి అడవుల్లోకి వెళ్లేలా మంకీఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకంలో బచ్చిరెడ్డిపల్లి, కొండాపూర్ తదితర గ్రామాల్లో పండ్ల తోటలు పెంచుతున్నాం. కోతులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

-కూచన ప్రకాశ్, ఎంపీఓ, నల్లబెల్లి

బాధిత కుటుంబాలకు పరామర్శ

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్ గ్రామ మాజీ సర్పంచ్ కుమారస్వామి తల్లి యాదమ్మ ఆదివారం మృతి చెందారు. కాగా వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేఆర్ నాగరాజు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. బొంపెల్లి దేవేందర్‌రావు, అనిల్‌రావు, జాటోత్ శ్రీనివాస్‌నాయక్, దయాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండలంలోని బోజేర్వు గ్రామానికి చెందిన బోయిని రవీందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి మదన్‌మోహన్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అలాగే మండలంలోని ఖాదర్‌పేట గ్రామానికి చెందిన మేడిద లక్ష్మణ్ తల్లి మేడిద యాకమ్మ ఆదివారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. నాయకులు బాల్నె వెంకన్నగౌడ్, తిరుపతి, జక్క అశోక్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

16న ఇంటర్వ్యూ

పర్వతగిరి : మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈనెల 16న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీదేవి ఆదివారం ప్రకటనలో తెలిపారు. పీజీటీ ఎకనామిక్స్, కామర్స్, టీజీటీ ఇంగ్లిష్, హిందీ, హెచ్‌పీటీ ఇంటర్వ్యూలను నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో 16వ తేదీ ఉదయం 10గంటలకు హాజరు కావాలని కోరారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకొని అభ్యర్థులు కూడా బుధవారం ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావాలన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



నర్సంపేట : స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఇంటింటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మిరామానంద్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 19వ వార్డులో ఆదివారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 15న వార్డులో ప్రతీ ఒక్కరు తమ ఇంటి మీద జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



దుగ్గొండి : మండలంలోని ఆయా గ్రామాల్లో రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్సై పరమేష్ అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రౌడీషీటర్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో వారు చేసిన నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా చక్కగా ఉండాలన్నారు. గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే సహించేది లేదన్నారు. రౌడీ షీటర్ల వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా తమకు చేరవేయాలని ఆయన సూచించారు.

నియామకం


ప్రభాకర్

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన ఎలికట్టె ప్రభాకర్‌ను మాదిగ పోరాట రాజకీయ సమితి(ఎమ్మార్పీఎస్) మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ఆదివారం బీఎస్ రమేష్‌కుమార్ మాదిగ ప్రకటనలో తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తన పదవికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

విజయవంతం చేయాలి



నల్లబెల్లి : రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్లేపల్లి ప్రణయ్‌దీప్ అన్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ అత్యవసర సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూపం మహాసభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు పరికి కొర్నేల్, బొట్ల నరేష్, పరికి రత్నం, ములుగు సుదర్శన్, కందిక రమేష్, జన్ను మల్లయ్య, మంద నర్సయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతి


రాములు(ఫైల్)

గీసుకొండ : మండలంలోని నందనాయక్ తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్యా రాములు(50) ఆదివారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. రాములుకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. రాములు మృతి విషయం తెలుసుకుని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, సర్పంచ్‌లు అంకతి నాగేశ్వర్‌రావు, బాదావత్ అమ్మిపంతులు, కేలోత్ సరోజ, స్వామిచౌహాన్, నాయకులు భూక్యా వీరస్వామి, రవీందర్, గుగులోత్ రాజు, నర్సింహ, రమేష్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వృద్ధురాలి అదృశ్యం


సారమ్మ

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కందుల సారమ్మ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై తోట మహేందర్ ఆదివారం తెలిపారు. సారమ్మ(72) నెల రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఈమెకు మాటలు రావు, చెవులు వినబడవని కుటుంబ సభ్యులు తెలిపారు. నర్సంపేట పట్టణంలోని జయలక్ష్మి సెంటర్‌లో తిరుగుతున్నట్లు సమాచారం ఉందని ఆచూకీ తెలిసిన వారు 87126 85024, 99630 89639 కి సమాచారం అందించాలన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.